క్లుప్తంగా

వేగవంతంగా సీసీరోడ్ల పనులు



మరికల్: ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద మండలంలో వేగవంతంగా సీసీరోడ్డు పనులు సాగుతున్నాయి. ఇప్పటికే మరికల్, అప్పంపల్లి, మాధవరం, పల్లెగడ్డ, రాకొండ, పూసల్‌పహాడ్, వెంకటాపూర్, పెద్దచింతకుంట గ్రామాల్లో ఒక్కొక్క రోడ్డుకు రూ. 5 లక్షల చొప్పున నిధులు కేటాయించడంతో పనులు పూర్తి చేశారు. అక్కడక్కడ ఇసుక కొరత కారణంగా కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాల్సింది. ఆన్‌లైన్ ద్వారా ఇసుకను కొనుగోలు చేసి ఈ నెల చివరిలోపు రోడ్ల పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

నేటినుంచి ప్రవచనాలు ప్రారంభం

మాగనూర్: మండలంలోని నేరడగంలో శ్రీ పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠంలో శ్రీ సిద్దలింగమహాస్వాముల వారు జాతర మహోత్సం సందర్భంగా 18 నుంచి 27వరకు ప్రతి రోజు సాయంత్రం 7గంటల నుంచి 9:30 వరకు అధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న స్వామివారి మహోత్సవం, 29న నామాకరణ మహోత్సవ, పల్లకిసేవ ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ



మాగనూర్: మండలంలోని ఆదివారం వర్కూర్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు శివ కుమార్ పదోతరగతి విద్యార్థులకు తనవంతు సాయంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నుల ఇతర సామగ్రిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలు మంచిగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

నర్వ: మండలంలోని నాగిరెడ్డిపల్లి వద్ద డబుల్ రోడ్డుపై బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. లంకాల్‌కు చెందిన వ్యక్తి అమరచింత నుంచి తన స్వగ్రామానికి తిరిగి వస్తుండగా అతను రోడ్డుపై ఆరబోసిన ఆముదాల బొడ్డెను గమనించకుండా దానిపైకి వచ్చి అదుపు తప్పి కింద పడడంతో గాయాలైయ్యాయి. వెంటనే మెరుగైన వైద్యం అందించేందుకు అమరచింతకు తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు..

మక్తల్: పట్టణంలోని రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మక్తల్‌కు చెందిన ఉప్పరి వెంకన్న ఆదివారం రాత్రి రాయిచూర్ నుంచి బైక్‌పై పులిమామిడికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి బైక్‌పై అతివేగంగా రావడంతో ఉప్పరి వెంకన్నను ఢీకొట్టడంతో తీవ్రగాయాలైయ్యాయి. వెంటనే చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ సంఘటనపై కుటుంబసభ్యులు అలివేలమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

కథన నిర్మాణ కార్యశాలపై అవగాహన



నారాయణపేట రూరల్ : పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం కథన నిర్మాణ కార్యశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా దక్షిణమధ్య క్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణ్‌రావు హాజరై చరిత్ర వక్రీకరణ, కళాసాహిత్యం, పత్రికలు, సినిమా రంగాలు సాహిత్యంపై వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు కే.రతంగపాండురెడ్డి, కృష్ణమాచార్యులు, ఎల్లప్ప, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం దత్తుచౌద్రి, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు

అమరచింత: ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని నాగల్‌కద్మూర్ శివారులో పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు రూ.50 వేల మేరకు నగదు, ఆభరణాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే రశీదులు వెంట తీసుకెళ్లాలని సూచించారు. అక్రమంగా మద్యం రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి కేంద్ర బలగాలతో వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అధ్వానంగా రహదారులు

- పూర్తిగా ధ్వంసమైన మూలమల్ల రహదారి
- పదేళ్లుగా ప్రయాణికుల పాట్లు
- రూ.8.50 కోట్లతో నిలిచిన రోడ్డు పనులు



సింగంపేట శివారులో గుంతలమయంగా రోడ్డు



ఆత్మకూర్ శివారులో గుంతలమయంగా మారిన మూలమల్ల రహదారి

ఆత్మకూర్: ప్రయాణం.. నరకప్రాయంగా మారింది. ఏళ్లు గడుస్తున్న పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని మూలమల్ల, నందిమల్ల గ్రామాలకు, జూరాల ప్రాజెక్టుకు వెళ్లేందుకు ఆత్మకూర్ పెట్రోల్‌బంకు మలుపునుండి మొదలుకుని 7కిలో మీటర్ల మేర బీటీరోడ్డును వేశారు. 2004లో వేసిన రోడ్డు ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. గుంతలమయమైన రోడ్డును మరమ్మతులు లేకుంటే కొత్త బీటీరోడ్డు వేయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని మూలమల్ల, నందిమల్ల గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.8.50 కోట్లతో నిలిచిన రోడ్డు..

మూలమల్ల మలుపు నుంచి నందిమల్ల, జూరాల ప్రాజెక్టు వరకు రూ.8.50 కోట్ల నిధులతో 2016లో రోడ్డు పనులు అట్టహాసంగా ప్రారంభించారు. మొదటి దఫా నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులను మధ్యలోనే వదిలేశాడు. ఈవిషయమై గ్రామస్తులు పలుమార్లు పీజేపీ కార్యాలయం వద్ద ధర్నా చేసిన నిధులలేమితో పనులు ముందుకెళ్లలేదు. పంచాయతీరాజ్ నిధుల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



నందిమల్ల నుంచి మూలమల్ల మీదుగా ఆత్మకూర్‌కు వెళ్లాలంటే భయమేస్తోంది, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇది వరకే ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్న పనులు జరగడం లేదు. ఈ విషయాన్ని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లాం.

\- రాజేందర్‌రెడ్డి, నందిమల్ల, అమరచింత

అధికారుల అసమర్థత..



2016లో పుష్కరాలప్పుడు మంజూరైన రోడ్డు పనులు నేటికి పూర్తికాకపోవడం పాలకులు, అధికారుల అసమర్థతనే కారణం. నిత్యం ప్రమాదాలు జరుగుతు న్నా, ప్రయాణికులు చనిపోతున్నా స్పందించకపోవడం పాలకుల పనితీరుకు నిదర్శనం. వెంటనే పనులను ప్రారంభించకపోతే పెద్ద ఎత్తను ఉద్యమిస్తాం.

\- మోష, మూలమల్ల, ఆత్మకూర్ మండలం

పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు

నర్వ: నేటి నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఉన్నత పాఠశాల, కస్తూర్బా గురుకుల పాఠశాల, పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాల మూడు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రాల ఆవరణలో నేటి నుంచి 144సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ మల్లారెడ్డి, ఎస్ఐ కురుమయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని బుక్‌స్టాల్స్, జిరాక్స్ సెంటర్లు ఓపెన్ చేయొద్దన్నారు. పెద్దకడ్మూర్ పాఠశాలలో 127మంది, జెడ్పీహెచ్ఎస్‌లో 209మంది, కేజీబీవీలో 170మంది మొత్తం 506మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

మక్తల్: నేటి నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బాలుర పాఠశాలలో 240మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 240 మంది, బిలియంట్ స్కూల్‌లో 189మంది, అక్షర పాఠశాలలో 200మంది, మొత్తం 7678మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

చెరువు కట్టపై వెళ్లేదెలా?



మాగనూర్: మండల కేంద్రంలోని ఊరపెద్ద చెరువు కట్టపై ముళ్లపొదలు అడ్డంగా పెరిగాయి. దీంతో నిత్యం చెరువు కట్టపై మహిళలు, యువకులు, వృద్ధులు పొలాలకు, ఇతర గ్రామాలకు వెళ్లివస్తుంటారు. దీంతో అడ్డుగా పెరిగిన ముళ్ల పొదలతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కట్టపై ముళ్లకంపలను తొలగించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెంకటేష్ ఆశయ సాధనకు కృషిచేద్దాం



అప్పక్‌పల్లిలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు సీహెచ్. వెంకటేష్ ఆశయసాధనకు కృషిచేద్దామని వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని అప్పక్‌పల్లిలో ఆదివారం వెంకటేష్ వర్ధంతిని నిర్వహించి, ఆయన చిత్రటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నతనం నుంచి పీడీఎస్‌యూలో విద్యార్థుల సమస్యలకు పోరాటం చేశాడని, తర్వాత పార్టీలో కీలకంగా ఉంటూ పలుర కాలైన పదవులు అధిరోహించి రాష్ట్ర స్థాయికి చేరుకున్నాడన్నారు. కార్యక్రమంలో నర్సింహ, కాశీనాథ్, కాలేశ్వర్, రాము, వెంకటేష్, అంజి, శాంత, విజయలక్ష్మి, గణేష్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

నేడు పశువైద్య శిబిరం

నర్వ: మండలంలోని లక్కర్‌దొడ్డి, ఎల్లంపల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డా. అశోక్ తెలిపారు. ఈ గ్రామాల్లో సోమవారం నిర్వహించే ఈ శిబిరాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తామన్నారు. తప్పకుండా పశువులకు నివారణ టీకాలను వేయించుకుని రోగాల బారినుంచి రక్షించుకోవాలన్నారు. అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూలుతున్న పాఠశాల ప్రహరీ

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడలను గుర్తుతెలియని వ్యక్తులు కూలగొడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండటంతో పరీక్ష కేంద్రంగా కొనసాగుతున్న జెడ్పీహెచ్ఎస్ ప్రహరీ రంధ్రాన్ని మూసివేయలేకపోతున్నారు. కేంద్రం వద్ద 144 సెక్షలు అమలు పరుస్తున్నామని చెబుతున్న అధికారులు పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చిన వారిని గుర్తించి చర్యలు తీసుకోలేకపోవడంతో, అదే దారివెంట పాఠశాల మైదానం నుంచి బీసీ కాలనీకి చెందిన ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పూడ్చివేయాలని కోరుతున్నారు.



జెడ్పీ ఉన్నత పాఠశాలలో కూలిన ప్రహరీ

నిలిచిన పంచాయతీ భవన పనులు



మరికల్: మండలంలోని మాధవరంలో బిల్లులు రాక పంచాయతీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. శిథిలావస్థకు చేరిన పాత పంచాయతీ కార్యాలయాన్ని తొలగించి అదేస్థలంలో నూతన పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి గతేడాది పనులు ప్రారంభించారు. ప్రస్తుతం శ్లాబ్ వరకు పనులు జరిగాయి. నిధులు విడుదలచేసి ఎన్నికలలోపు భవనాన్ని నిర్మించేందుకు అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈతకెళ్తున్నారా.. జర జాగ్రత్త!

పాన్‌గల్: వేసవి వచ్చిందంటే చాలు యువత, చిన్నారులు చెరువులు, కాల్వల్లో స్నానాలకు వెళ్తుంటారు. సరదాగా వేసవి తాపం తీరుకోవడానికి వెళ్లి వారి కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నారు. ఇలా సరదా విషాదం నింపిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ వేసవిలో అయినా కనీస జాగ్రత్తలు పాటించి సరదా సమయాన్ని విషాదం కాకుండా చుసుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు.

- 15 ఏళ్ల లోపు పిల్లలు చెరువులు, కుంటలు, వాగుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు చూసుకోవాలి.
- శిక్షకుడి పర్యవేక్షణలో ఈత నేర్పించాలి.
- తల్లిదండ్రులు తీసుకెళ్తే మోకాలు, నడుము లోతు వరకే దిగేలా చూడాలి.
- యువత మద్యం, మత్తు పదార్థాలు తీసుకొని నీటిలోకి దిగవద్దు.
- పాఠశాలలకు ఒంటి పూట బడి ఉండటంతో బడి వదిలిన వెంటనే విద్యార్థులు ఈతలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో పాటు పోలీసులు కూడా గ్రామాల్లో ఈతకు వెళ్లే వారికి అవగాహన కల్పిస్తే ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయని పలువురు వాపోతున్నారు.

వైభవంగా ఈదమ్మ జాతర



అమిస్తాపూర్‌లో ఈదమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో ఆదివారం ఈదమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో అమ్మవారిని బీజేపీ జాతీయ అధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈదమ్మ ఉత్సవాల్లో భాగంగా మొదటి శకటోత్సవం, రెండోరోజు బోనాలతో ప్రదక్షిణలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మండల బీజేపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డి, గూటం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జంగమయ్యపల్లి గ్రామంలో బోనాల ఊరేగింపు



పూజలు చేస్తున్న డీకే అరుణ

ఘనంగా బోనాల పండుగ

నవాబుపేట: మండల పరిధిలోని జంగమయ్యపల్లి గ్రామంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపులు చేపట్టారు. గ్రామ దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలకు వచ్చిన ఆడపడుచులకు పుట్టింటి సారేను అందించిన గ్రామస్తులు ఆదివారం విందులు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ వెంకటేష్, రాజు, వెంకటయ్య, గోపాల్, వెంకటేష్, లింగం, శేఖర్, బాల్‌రాజ్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



తిర్మలాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కేంద్రబలగాలు

నారాయణపేట రూరల్ : ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ఓటుహక్కు వినియోగించుకునే స్వేచ్ఛ ఉందని, భయపడకుండా ధైర్యంగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కృష్ణదేవ్ అన్నారు. మండలంలోని కోటకొండ, తిర్మలాపూర్ గ్రామాల్లో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి ఎన్నికల సంఘం, పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. డబ్బులు, గిఫ్టుల రూపకంగా ఇస్తే తీసుకోరాదని, స్వచ్ఛందంగా నచ్చిన వ్యక్తులకు ఓటు వేయాలన్నారు. ఎన్నికల విషయంలో ఎవరైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే అవకాశం ఉన్నట్లు ఎవరి దృష్టికి వచ్చిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సీపీఎం జిల్లా నాయకుడు అంజిలయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని దేశాయ్‌పల్లిలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్యాడ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పదోతరగతి పరీక్షలు ఉన్నత విద్యకు పునాది లాంటివని, ఉన్నత లక్ష్యంతో పరీక్షలు రాయాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉతన్న చదువుల్లో జీపీఏ ఆధారంగా పాలిటెక్నికల్, అగ్రికల్చర్ డిప్లొమో ఐటీఐ వంటి చదువుల్లో సీట్లు సంపాధించుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అంజప్ప, భాస్కర్‌రెడ్డి, రాములు, హన్మంతు, గోవింద్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సన్మానం పొందిన గురువులతో పూర్వ విద్యార్థులు

కోస్గి: మండల పరిధిలోని గుండుమాల్ దయానంద విద్యామందిర్‌లో పాఠశాలలో 1986లో పదోతరగతి చదివిన విద్యార్థులతోపాటు 2024 వరకు చదువుతున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డవారు కొందరు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నవారు మరికొందరు ఆత్మీయ సమ్మేళనంలో మరోమారు కలుసుకొని తమ తమ సాధకబాదకాలను చర్చించుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్య సమాజ్ అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్యా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సన్మానం పొందిన గురువులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

విద్యకాషాయీకరణకు వ్యతిరేకం



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్

నారాయణపేట రూరల్ : విద్యరంగంపై కాషాయ రంగు మార్కును వేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ కుట్రలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేదరికం పెరిగిపోతుంటే పట్టనట్లు వ్యవహరించడం మోదీ ప్రభుత్వానికి తగదన్నారు. ఉద్యోగాల కల్పనలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగులకు మొండి చేయి చూయించిందన్నారు. భగత్‌సింగ్‌ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తామని, పోరాటంతోనే సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో సిద్దూ, సలీం, ఆనంద్, రవి, మల్లేష్, రాము, మధు, శ్రీను, బాలకృష్ణ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : మున్నూరుకాపు సంఘానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో ఆదివారం రాత్రి సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. మున్నూర్‌కాపు సంఘాన్ని గుర్తించడంపై రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్‌రెడ్డి, మాణిక్యప్ప, పరమేష్, బసిరెడ్డి, బాలరాజు, బాలకృష్ణరెడ్డి, బాలప్ప, నాగిరెడ్డి, రవి, వెంకటప్ప, సుదర్శన్, అనంతయ్య, చెన్నారెడ్డి, నరేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



మహిళ ఉద్యోగులకు సన్మానం చేస్తున్న లయన్స్ సభ్యులు

మక్తల్: సమాజంలో సేవ చేసినప్పుడే గుర్తింపు వస్తుందని లయన్స్‌క్లబ్ రిజీయన్ చైర్మన్ రమేష్ రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వాలనచేసి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేసిన సేవ కార్యక్రమాలను చదివి వినిపించారు. మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ ఉద్యోగులకు, డాక్టర్లకు శాలువాతో సన్మానించారు. అనంతరం కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వక్త మోహన్ రావు, ప్రొగ్రాం చైర్మన్ కొండయ్య, డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ, కోటేశ్వర్‌రావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబాదాస్‌రావు, శ్రీనివాస్, వెంకటయ్య, అరుణ, నాగరాజు, పృధ్వీరాజ్, అంజన్‌ప్రసాద్, చంద్రకాంత్‌గౌడ్, నరేందర్, జైపాల్‌రెడ్డి, కోళ్ల వెంకటేష్, ఆంజనేయులు, పాపిరెడ్డి, శరణప్ప తదితరులు పాల్గొన్నారు

చలివేంద్రం ఏర్పాటు

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ఆదివారం చలి వేంద్రం ప్రారంభించారు. గ్రామానికి చెందిన సామాజిక వేత్త షేక్ అబ్దుల్ జాంగీర్ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవి ముగిసే వరకు ప్రజలకు చల్లని తాగు నీటిని అందిస్తామన్నారు. ఎంపీటీసీ కిష్టన్న, సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణ గోపాల్ పాల్గొన్నారు.